క్లుప్తంగా

వాకతిప్ప పీహెచ్‌సీలో విచారణ



వాకతిప్ప పీహెచ్‌సీలో విచారణ చేపడుతున్న భరతలక్ష్మి

కపిలేశ్వరపురం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ వాకతిప్ప పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఎస్ సత్యవతిపై అందిన ఫిర్యాదుపై అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భరతలక్ష్మి ఆ పీహెచ్‌సీలో శుక్రవారం విచారణ జరిపారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు పి.చంద్రమౌళి, చిట్టూరి రాకేష్ చౌదరి, సహచర వైద్య సిబ్బందిని విచారించి రికార్డులు పరిశీలించారు. విచారణాంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆమె తెలిపారు. కాగా సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్ భరతలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు.

అమర వీరుల సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు అమర వీరుల త్యాగాలు వివరిస్తున్న ఎస్సై జానీ బాషా

కె.గంగవరం: పోలీస్ అమర వీరుల సేవలు చిరస్మరణీయమని కె.గంగవరం ఎస్సై జానీ బాషా అన్నారు. కె.గంగవరంలో శుక్రవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అను నిత్యం పోరాడుతున్నారని, విరామం లేకుండా విధి నిర్వహణ చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం నిత్యం ప్రజల రక్షణ కోసం పోలీసులు నిర్వర్తించే విధులు, స్టేషన్‌లోని పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించారు.

నేటి నుంచి పశుగణన



వెల్ల గ్రామ సచివాలయం వద్ద పశుగణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రామచంద్రపురం రూరల్: శనివారం నుంచి జిల్లాలో ప్రారంభం కానున్న పశు గణనకు రైతులు సహకరించి పశుగణన పూర్తిస్థాయిలో విజయవంతమయ్యేలా సహకరించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పంపన రామచంద్రరావు కోరారు. మండలంలోని వెల్ల గ్రామ సచివాలయం వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి పశు గణనను ప్రభుత్వాలు చేపడతాయన్నారు. దీని ద్వారా పశువులకు ఎన్ని టీకాలు కావాలి, ఎన్ని మందులు అవసరం అవుతాయి తదితర అంశాలపై అంచనాలు సిద్ధం చేసుకోవడానికి తద్వారా బడ్జెట్ కేటాయింపులు చేసుకోవడానికి దోహదం అవుతుందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పశు గణన నిమిత్తం వైద్య సిబ్బంది వచ్చినప్పుడు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, గ్రామ పశు సంవర్ధక శాఖ సహాయకుడు కప్పల నరేంద్ర, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

కాజులూరు: గొల్లపాలెం, యానం రహదారిలో బందనపూడి ఊటచెరువు సెంటరు వద్ద శుక్రవారం ఒక స్కూటరిస్టు అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన గాజులపూడి రామచంద్రరాజు తన స్కూటరుపై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. బందనపూడి శివారు ఊటచెరువు సెంటరు వద్దకు వచ్చేసరికి స్కూటరు అదుపుతప్పి రోడ్డు పక్కన గోతుల్లో పడ్డాడు. ఈ ఘటనలో రామచంద్రరాజు గాయాల పాలవ్వగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం గొల్లపాలెంలొని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

దొంగకు దేహశుద్ధి

రాయవరం: సెల్‌ఫోన్లు దొంగతనం చేసిన వ్యక్తికి రాయవరం గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ గ్రామంలోని పోలమ్మ గుడి వద్ద గురువారం రాత్రి మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు నిద్రిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ యువకుడు వారి సెల్‌ఫోన్లు దొంగతనం చేశాడు. శుక్రవారం ఉదయం చూసుకున్న మాలధారులు సీసీ టీవీ ద్వారా దొంగను గుర్తించారు. గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో అతడిని పట్టుకుని గ్రామస్తులు దేహశుద్ధి చేశారు.

అన్నదాతలకు అందని సాయం

- జగనన్న పాలనలో సాగు తొలి దశలోనే ఠంఛన్‌గా పెట్టుబడి సాయం
- పథకం పేరు మార్చి విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఖరీఫ్ ముగుస్తున్నా అందని 'అన్నదాత సుఖీభవ' లబ్ధి

కాజులూరు: సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి గద్దెనెక్కగానే వాటిని తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వం రైతన్నలను నిలువునా మోసం చేస్తోంది. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశపడిన రైతులకు కుటమి ప్రభుత్వ తీరు నిరాశే మిగుల్చుతోంది. ఏడాదికి రూ. 20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నేడు రైతులకు మొండి చేయి చూపిస్తున్నారు. జగనన్న పాలనలో ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చారే తప్ప సాయం అందజేయలేదు. ఈ ఏడాది జూలై మొదటివారం నుంచి డివిజన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. మాగాని భూములు అధికంగా ఉన్న రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో 90 శాతం రైతులు తొలకరిలో వరి సాగుకే ప్రాధాన్యతనిస్తుంటారు.

పీఎం కిసాన్ సొమ్ము జమ

తొలకరి తొలిదశలో పుష్కలంగా వర్షాలు కురవటంతో రైతులు నారుమడులు, నాట్లు వేసుకున్నారు. వాతావరణ అనుకూలించటంతో పంట ఏపుగా పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవటంతో సాగు పెట్టుబడికి అవసరమైన డబ్బులు లేక రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయం రూ. రెండు వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయం ఊసేలేదు. మే నెలలోనే రైతు భరోసా నగదు రూ.5,500 ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అది కాస్త అగిపోయింది. ప్రస్తుతం కేంద్ర అందజేసిన పీఎం కిసాన్ నగదు కాస్త కూలీ ఖర్చులకు ఉపయోగపడింది. ఇంకా ఎరువులు, విత్తనాల కొనుగోలుకు, దుక్కిదున్ని నాట్లు వేసేందుకు రైతులు అప్పు చేయ్యాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంటపై ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు అధికంగా ఖర్చవుతుండటంతో నియోజకవర్గంలో 40,464 మంది రైతులు ప్రభుత్వం సాయం కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



కాజులూరులో కోత దశకు చేరుకున్న వరి పైరు

రామచంద్రపురం నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు వివరాలు

మండలం	సాగు పరిధి (ఎకరాల్లో)
కాజులూరు	19,255
కె గంగవరం	15,860
రామచంద్రపురం	19,100



గొల్లపాలెంలో ఈనిక దశలో ఉన్న వరి పంటపై పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతులు

సాగు ప్రారంభంలోనే జగనన్న రైతుకు సాయం

పంటల సాగు పెట్టుబడి కోసం రైతన్నలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగు ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందించేది. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతు భరోసా పథకంలో రూ.7,500 కలిసి ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతలుగా రైతులకు జగనన్న ప్రభుత్వం అందించేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మళ్లీ కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు మొదలయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి సొమ్ము లేక ఇబ్బందులు



ప్రస్తుతం పంటలపై పురుగులు, తెగుళ్ల దాడి అధికంగా ఉంది. పెట్టుబడికి చేతిలో డబ్బు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఏటా ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోతున్నాయి. ప్రైవేటు వ్యాపారుల వద్ద మందులు అరువు తెచ్చి అధిక ధరలు చెల్లిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించాలి.

– సువ్వారి గోవిందు, రైతు, తర్లంపూడి

హామీలు అమలు చేయాలి



అధికారంలోనికి వస్తే పెట్టుబడి సాయం కింద రూ 20 వేలు అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో ప్రకటించారు. అధికారంలోనికి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ పథకం పేరు మార్చారే తప్ప ఎటువంటి సాయం అందించలేదు. పంట దాదాపు చివరి దశకు చేరుకుంది. పెట్టుబడులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాయం అందించాలి.

– చిర్ల వెంకటరెడ్డి, రైతు, బందనపూడి

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 15 రోజుల జైలు

మండపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ యువకుడికి 15 రోజుల జైలు శిక్ష విధించినట్టు మండపేట రూరల్ ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. ద్వారపూడి బస్టాండ్ సెంటర్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న లచ్చిరెడ్డి పృథ్వీకుమార్ అనే యువకునికి పోలీసులు బ్రీతింగ్ పరీక్ష చేశారు. మద్యం సేవించినట్టు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి ఆలమూరు కోర్టుకు హాజరు పర్చారు. న్యాయమూర్తి నిందితుడికి 15 రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్సై తెలిపారు.

వడ్లమూరులో రెవెన్యూ సదస్సు



వడ్లమూరు సభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: మండలంలోని వడ్లమూరు గ్రామంలో శుక్రవారం భూముల రీసర్వే గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో భూయాజమానులు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. తహసీల్దార్ చిన్నారావు సమక్షంలో రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారులు భూహక్కుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారుల సమసక్షంలో వాటిని నమోదు చేశారు. సర్పంచ్ మంగాయమ్మ మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నారు.

నాణ్యత ఉంటేనే ధాన్యానికి మద్దతు ధర

- రైతుకు ఈ విషయం తెలియజేయండి
- ఇన్‌చార్జ్ ఏడీఏ రమేష్‌కుమార్

రాయవరం: రైతులు పండించిన ఖరీఫ్ ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటేనే కొనుగోలు సమయంలో మద్దతు ధర లభిస్తుందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలని ఆలమూరు సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏ రమేష్‌కుమార్ సూచించారు. మండలంలోని సోమేశ్వరం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రాయవరం, మండపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. (రాష్ట్రీయ కృషి వికాస యోజన) రాఫ్తార్ పథకంలో భాగంగా ఈ శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా రాయవరం ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇన్‌చార్జ్ ఏడీఏ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ధాన్యంలో 17 శాతం లోపు తేమశాతం ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు రైసుమిల్లు ర్యాండమైజేషన్ అవసరం లేకుండా రైతుకు నచ్చిన రైసు మిల్లు పేరును, ధాన్యం కొనుగోలు సిబ్బందికి తెలియజేయవచ్చునన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి మనోహర్ మాట్లాడుతూ వరి పంటలో యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు పురుగుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వరి పంటకు ఎకరాకు పంట రుణ పరిమితి రూ. 42 వేలకు గాను, రైతులు 1.5 శాతం అనగా ఎకరాకు రూ.630 చెల్లించి, పంటల బీమా పథకంలో అర్హత పొందాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారులు ఏసుబాబు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఏడీఏ రమేష్‌బాబు

లబ్ధిదారులకు టిడ్కో గృహాల అందజేత

రామచంద్రపురం: పట్టణంలోని మూడు నిరుపేద కుటుంబాలకు 1వ వార్డు కొత్తూరులోని టిడ్కో గృహాల కేటాయింపు పత్రాలు అందజేసినట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారుల్లో మామిడి దుర్గమ్మ కుటుంబం పట్టణంలోని పెద్ద వంతెన దగ్గర గల వెల్ల రోడ్డులో చెట్టు కింద పదేళ్లుగా సిమెంటు తూరలో నివాసముంటున్నారని, వారికి గతంలో ఇచ్చిన హామీ మేరకు సింగిల్ బెడ్ రూమ్ టిడ్కో గృహాన్ని కేటాయించామన్నారు. రామచంద్రపురానికి చెందిన చిన్న వయస్సులోనే భర్త చనిపోయి ఇబ్బందులు పడుతున్న దొమ్మల పాటి సవిత, నిరుపేదరాలైన కొమ్మూరి ప్రమీలకు కూడా సింగిల్ బెడ్ రూమ్ టిడ్కో గృహాలను కేటాయించామన్నారు. వీరందరికీ ఇళ్ల మంజూరు పత్రాలతోపాటు నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు అందించినట్టు మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ ఓమ్మి అయ్యప్ప నాయుడు, టిడ్కో సీఎల్టీసీ బిందు మాధవి, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం తన క్యాంప్ ఆఫీసులో అందించారు. రామచంద్రపురం మండలం ఉండూరుకి చెందిన అనుసూరి రాంబాబు, పట్టణానికి చెందిన గుత్తుల ముత్యాల రాజు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి మెరుగైన వైద్యానికి సీఎం సహాయ నిధి అందించినట్టు తెలిపారు. రూ.40 వేల చెక్కును అనుసూరి రాంబాబుకు, రూ.75,699 చెక్కును గుత్తుల ముత్యాల రాజుకు మంత్రి అందజేశారు.

వ్యవసాయ విస్తరణాధికారిగా హేమంత్‌కు పదోన్నతి



హేమంత్‌ను సత్కరిస్తున్న ఏవో ప్రభాకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామ వ్యవసాయ సహాయకుడు సూరంపూడి హేమంత్‌కు వ్యవసాయ విస్తరణాధికారిగా పదోన్నతి లభించింది. హేమంత్ పదోన్నతిపై కె.గంగవరం మండల వ్యవసాయ విస్తరణాధికారిగా వెళ్తున్నారు. శుక్రవారం వెంటూరులో జరిగిన కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుల తరపున హేమంత్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై హేమంత్ సేవలను ప్రశంసించారు. అదేవిధంగా గ్రామ వ్యవసాయ సహాయకుడిగా ఉంటూ పెదపూడి మండలం నుంచి పదోన్నతిపై రాయవరం మండలానికి వ్యవసాయ విస్తరణాధికారిగా అడపా శివశంకర్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా శివశంకర్‌ను మండల వ్యవసాయ సహాకులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



బాణసంచా దుకాణదారులకు సూచనలు చేస్తున్న అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు

రామచంద్రపురం: తాత్కాలిక బాణసంచా షాపుల నిర్వహణదారులు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రపురం అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బాణసంచా షాపులు నిర్వహణదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ బి.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం షాపులు నిర్వహించాలన్నారు. డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే షాపులు ఏర్పాటు చేయాలన్నారు. సీఐ కడియాల అశోక్‌కుమార్, ద్రాక్షారామ ఎస్సై లక్ష్మణ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

రామచంద్రపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు నిచ్చారు. ఎన్‌డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లయిన్స్ కల్యాణ మండపంలో విస్తృతస్థాయి సమావేశం మంత్రి సుభాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ పోటీ చేస్తున్నట్టు తెలిపారు. మరో ముఖ్య అతిథిగా రాయలసీమ శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసినప్పటికీ పట్టభద్రులు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు అయిన తరువాత ఆ ఓటు రద్దవుతుందని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

తపాలా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న తపాలా సిబ్బంది

రామచంద్రపురం: అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కాని రోజుకో రకమైన టార్గెట్లను వెంటనే నిలుపుదల చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం విధులు నిర్వహణ అనంతరం నిరసన కార్యక్రమాన్ని చేశారు. మూడు రోజులుగా తపాలా శాఖలో కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో తమ నిరసనను వ్యక్తం చేస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తపాలా శాఖ ఎన్ఎఫ్‌పీఈ నేతలు మాట్లాడుతూ ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్-సీ సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. 8వ వేతన సవరణ కమిటీని వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ ఓపీఎస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని, అన్ని కేడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని కోరారు. సక్రమైన రీతిలో డాక్ కర్మయోగి, ఐగాట్ కర్మయోగి శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. యూనియన్ నేతలు కొండపల్లి సూర్యనారాయణ, రాంబాబు, సాయికృష్ణ, రామారావు, రాయుడు, గణపతి, గంగరాజు పాల్గొన్నారు.

వెలుగుల సంబరానికి సన్నద్ధం

- ఈ నెల 31న దీపావళి
- బాణసంచా తయారీలో నిమగ్నమైన యజమానులు
- అనధికార తయారీదారులతో పొంచి ఉన్న ప్రమాదం

రాయవరం: 'జీవిత పరమార్థాన్ని విప్పి చెప్పేదే దీపావళి' అంటూ విరచించాడో సినీ కవి. చీకటి, వెలుగుల రంగేళీ వంటి జీవితానికి వెలుగు పూలు విరజిమ్మే దీపావళికి చాలా దగ్గరి పోలికలు ఉంటాయనేది అర్థం. ఈ నెల 31న దీపావళి పర్వదినం ఊరూ వాడా నిర్వహించుకోవడానికి అందరూ సన్నద్ధం అవుతున్నారు. వెలుగుపూల సంబరానికి అధికారికంగా అనుమతి పొందిన తయారీదారులు బాణసంచా తయారీలో నిమగ్నమయ్యారు.

క్లస్టర్ పరిధిలో

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో ప్రధానంగా రాయవరం, మండపేట, రామచంద్రపురం మండలాల్లో అధికారికంగా బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ దశాబ్దాలుగా బాణసంచా తయారు చేస్తున్నారు. ఏటా దీపావళికి ఆరు నెలల ముందు నుంచే బాణసంచా తయారీ చేపడతారు. స్థానికంగా తయారు చేసే బాణసంచాతో పాటు శివకాశి నుంచి కొనుగోలు చేసిన బాణసంచాను తయారీ కేంద్రాల వద్ద అమ్మకాలు చేపడతారు. రామచంద్రపురం ఫైర్ స్టేషన్ పరిధిలో రామచంద్రపురం మండలంలో మూడు, రాయవరం మండలంలో రెండు బాణసంచా తయారీ కేంద్రాలున్నాయి. మండపేట మండలంలో రెండు బాణసంచా తయారీ షాపులున్నాయి. ఫారం- 20 లైసెన్స్‌ను కలిగి ఉండడంతో బాణసంచా తయారీకి వీరికి అనుమతి లభించింది. అధికారికంగా తయారు చేసే షాపుల్లోను అప్పుడప్పుడూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

అనధికార తయారీతో

బాణసంచా తయారీ కేవలం అధికారికంగా లైసెన్స్ పొందిన చోట మాత్రమే తయారు చేయాలి. అయితే పలు గ్రామాల్లో అనధికారికంగా బాణసంచా తయారు చేస్తుంటారు. తగిన జాగ్రత్తలు పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా తయారు చేయడం వల్ల ఏటా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే బాణసంచాను అక్రమంగా నిల్వ చేయడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా నివాసాల మధ్య బాణసంచా నిల్వ చేయడం వలన పరిసరాల్లో ఉండే వారి ప్రాణాలు కూడా గాలిలో కలిసిపోవడమే కాకుండా భారీగా ఆస్తినష్టం కూడా సంభవిస్తుంది. గతంలో తాపేశ్వరంలో అనధికారికంగా బాణసంచా తయారు చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రస్తుతం దీపావళి సంభవిస్తున్న సమయంలో అనధికారికంగా బాణసంచా తయారు చేసే వారిపై దృష్టి సారించక పోతే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.



అమ్మకానికి సిద్ధం చేసిన బాణసంచా దుకాణం

సమాచారం ఇవ్వాలి



అనధికారికంగా బాణసంచా తయారు చేసే వారి సమాచారం ఇస్తే దాడులు నిర్వహిస్తాం. నివాసాల మధ్య బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా ప్రమాదం జరిగితే చుట్టు పక్కల వారికి నష్టం కలుగుతుంది. అనధికారికంగా బాణసంచా తయారు చేసినా, అక్రమ నిల్వలు కలిగి ఉన్నా ఉపేక్షించేది లేదు.

– బి.రామకృష్ణ, డీఎస్పీ, రామచంద్రపురం

తనిఖీలు చేపడితేనే..

బాణసంచా తయారీ కేంద్రాల్లో అధికారులు తనిఖీలు చేపడితే అక్కడ ఉండే లోపాలు బయటపడే అవకాశముంది. దీపావళి నేపథ్యంలో బాణసంచా తయారీ కేంద్రాలను అధికారులు తనిఖీలు చేపట్టడం పరిపాటిగా వస్తోంది. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపకదళ అధికారులు సంయుక్తంగా తయారీ కేంద్రాలను తనిఖీలు చేస్తారు. అలాగే ఇప్పటికే అధికారికంగా బాణసంచా తయారీ కేంద్రాలను అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలకు లైసెన్స్ సక్రమంగా ఉందా? లేదా? అనే విషయంతో పాటు కనీస జాగ్రత్తలు పాటిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్, డంపింగ్ యార్డులకు భూమి పూజ

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్, డంపింగ్ యార్డుల ఏర్పాటుకు శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం చేతుల మీదుగా భూమి పూజ చేశారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రామచంద్రపురం మున్సిపాలిటీకి ద్రాక్షారామ పరిధిలోని ఆదివారపుపేట వెళ్లే దారికి సమీపంలో 6 ఎకరాల స్థలం డంపింగ్ యార్డు నిమిత్తం మంజూరు చేయించారు. అదే స్థలంలో ప్రస్తుతం 2 ఎకరాలు ద్రాక్షారామకు డంపింగ్ యార్డు నిమిత్తం ప్రస్తుత మంత్రి వాసంశెట్టి సుభాష్ సిఫారసుతో కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ మంజూరు చేశారు. దీనిలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనువుగా గ్రావెల్‌తో నింపి సిద్ధం చేసేందుకు పనులను శుక్రవారం ప్రారంభించారు. అదే విధంగా ద్రాక్షారామ జగనన్న లే అవుట్-4లో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమిని మెరక చేయించే పనులను కూడా శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ డి. యేసురత్నం, ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, గ్రామ సర్వేయర్ సాయిరామ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ, నాయకులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

మండపేట: స్థానిక గాంధీనగర్ వీధిలోని విజయదుర్గమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్న సమారాధనను ప్రారంభించారు.